# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 27-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పీఎమ్ స్వనిధి పథకం పునర్ వ్యవస్థీకరణకు కేంద్ర మంత్రివర్గం ఈరోజు ఆమోదం తెలిపింది.
- ❖ స్వల్పకాలిక యుద్ధాల నుండి దీర్ఘకాలిక యుద్ధాల వరకూ అన్ని రకాల భద్రతా సవాళ్లకు సాయుధ దళాలు సిద్ధంగా ఉండాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.
- ❖ జమ్మూ కాశ్మీర్ లోని కత్రాలో కొండచరియలు విరిగిపడిన ప్రాంతంలో సహాయక చర్యలు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి.
- ❖ ఉగ్రవాదులు తమ వ్యూహాలను ఎన్ని విధాలుగా మార్చుకున్నా భారత్ సైన్యం వాటిని సమర్థవంతంగా తిప్పికొడుతుందని హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు.

=======================

పీఎమ్ స్వనిధి పథకం పునర్ వ్యవస్థీకరణకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రుణ వ్యవధిని 2024 డిసెంబర్ 31 తర్వాతి కాలానికి పొడిగించాలని తీసుకున్న నిర్ణయాలకు సైతం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈరోజు జరిగిన కేంద్రమంత్రివర్గ సమావేశంలో ఆమోదం లభించింది. దీంతో రుణ వ్యవధిని 2030 మార్చి 31 వరకు పొడిగించారు. పీఎమ్ స్వనిధి పథకం పునర్ వ్యవస్థీకరణ ద్వారా 50 లక్షల మంది కొత్త లబ్ధిదారులు సహా మొత్తం 1.15 కోట్ల మందికి ప్రయోజనం చేకూరనుంది. గృహనిర్మాణం పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) సంయుక్తంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి.

=======================

కర్ణాటక, తెలంగాణ, బీహార్ అస్సాం రాష్ట్రాలకు ప్రయోజనం చేకూర్చే మూడు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులతో పాటూ గుజరాత్‌లోని కచ్‌లో సుదూర ప్రాంతాలను అనుసంధానించే ఒక కొత్త రైలు మార్గానికి కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టులు అనుసంధానాన్ని మెరుగుపరచడంతో పాటు ప్రయాణ సౌలభ్యాన్ని కూడా పెంచుతాయి. అంతేకాకుండా లాజిస్టిక్ ఖర్చులను తగ్గించి, చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని కూడా తగ్గిస్తాయి.

=======================

ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న సంక్లిష్ట రాజకీయ పరిస్థితుల మధ్య స్వల్పకాలిక యుద్ధాల నుండి దీర్ఘకాలిక యుద్ధాల వరకూ అన్ని రకాల భద్రతా సవాళ్లకు సాయుధ దళాలు సిద్ధంగా ఉండాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లోని ఆర్మీ వార్ కాలేజ్ లో జరుగుతున్న 'రన్ సంవాద్' అనే కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ... భారత్ తనంతట తానుగా ఏ దేశంపై దాడి చేయదని కానీ భారత్ పై కుట్రలు చేస్తే మాత్రం ఊహించని రీతిలో ప్రతిదాడి చేస్తుందని స్పష్టం చేశారు. నేటి యుగంలో యుద్ధాలు అకస్మాత్తుగా ప్రారంభమై అనూహ్యంగా మారుతున్నాయన్నారు. ఏ యుద్ధమైనా ఎప్పుడు ముగుస్తుంది.. ఎంతకాలం ఉంటుంది.. అనేది అంచనా వేయడం ఇప్పుడు చాలా కష్టమవుతుందని రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానిస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

========================

జమ్మూ కాశ్మీర్ కత్రాలోని శ్రీ మాతా వైష్ణోదేవి ఆలయ మార్గంలో కొండచరియలు విరిగిపడిన ఘటనలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. గాయపడి శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం ఆ ప్రాంతంలో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ముందస్తు జాగ్రత్త చర్యగా ఆలయానికి వెళ్లే మరో రెండు మార్గాలను కూడా అధికారులు మూసివేశారు. ఇక ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. స్థానిక యంత్రాంగం బాధితులకు అవసరమైన సహాయం అందిస్తోందని తెలిపారు. మరోవైపు పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లోనూ భారీగా వర్షాలు కురుస్తున్నాయి.

========================

భారత సాంస్కృతిక వైభవానికి చిహ్నంగా నిలిచే గణేశ్ ఉత్సవాలు  మహారాష్ట్రలో ఈరోజు నుండి ప్రారంభమయ్యాయి. ఎటువంటి తారతమ్యం లేకుండా ప్రతీ ఒక్కరూ ఆనందోత్సాహాలతో గణేశుడి రాకను స్వాగతించారు. ప్రజల భాగస్వామ్యంతో ఈ పండుగ తదుపరి పదకొండు రోజుల పాటు అనంత చతుర్దశి వరకు కొనసాగనుంది.  అదే విధంగా ఇతర రాష్ట్రాల్లో కూడా ఈ పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు.

విరామం

========================

అమాయక పౌరులపై దాడులు చేసేందుకు కుట్రలు పన్నే ఉగ్రవాద సూత్రధారులకు ఆపరేషన్ సిందూర్, ఆపరేషన్ మహాదేవ్ స్పష్టమైన సందేశాన్ని పంపాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఆపరేషన్ మహాదేవ్‌ను విజయవంతంగా నిర్వహించి, పహల్గామ్ దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులను మట్టుబెట్టిన భారత సైన్యం, జమ్మూ కాశ్మీర్ పోలీసులు, CRPF సిబ్బందిని అమిత్ షా ఈరోజు కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆపరేషన్ సిందూర్ ప్రజలకు సంతృప్తినిచ్చింది కానీ ఆపరేషన్ మహాదేవ్ ఆ సంతృప్తిని నమ్మకంగా మార్చిందని చెప్పారు. ఆపరేషన్ మహాదేవ్‌లో మరణించిన ఉగ్రవాదులు పెహల్గామ్‌లో దాడికి పాల్పడినవారేనని జాతీయ దర్యాప్తు సంస్థకు చెందిన ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ సాంకేతికంగా నిరూపించిందని మంత్రి చెప్పారు. ఉగ్రవాదులు తమ వ్యూహాలను ఎన్ని విధాలుగా మార్చుకున్నా.. భారత్ సైన్యం వాటిని సమర్థవంతంగా తిప్పికొడుతుందన్నారు.

========================

భారత ఆర్థిక వ్యవస్థ చాలా దృఢంగా ఉందని, దేశంలోని పరిశ్రమలు కూడా చాలా బలంగా ఉన్నాయని విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ స్పష్టం చేశారు. 50 శాతం అమెరికా సుంకాలపై ఈరోజు న్యూఢిల్లీలో పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ.. ఈ సుంకాలతో దేశ ఆర్థిక వ్యవస్థ నష్టపోకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు.

(వాయిస్ 35 సెకన్లు)

========================

మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా కోపర్షి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, పోలీసులకు మధ్య ఈరోజు ఉదయం జరిగిన ఎదురు కాల్పుల్లో  నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు మహిళా మావోయిస్టులు ఉన్నారని ఘటనా స్థలిలో పెద్ద ఎత్తున ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. గడ్చిరోలి పోలీసులు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు ఇంకా కొనసాగుతున్నాయి.

========================

ప్రతీ కుటుంబానికి బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన "పీ.ఎం. జన్ ధన్ యోజన" రేపటితో 11 సంవత్సరాలు పూర్తి చేసుకుంటోంది. గత దశాబ్ద కాలంలో బ్యాంకింగ్, ఋణ సదుపాయం, బీమా, పింఛన్లను అందరికీ అందుబాటులోకి తీసుకురావడంలో పీఎం జన్ ధన్ యోజన సఫలీకృతమయ్యింది. ఇది దేశవ్యాప్తంగా నేడు 56 కోట్లకు పైగా జన్ ధన్ ఖాతాలతో పౌరులకు ఆర్థిక గౌరవాన్ని కల్పిస్తోంది. ఈ మొత్తం ఖాతాలలో 56 శాతం కంటే ఎక్కువ మంది మహిళలే ఉండటం మరో కీలక మైలురాయిగా నిలిచింది. గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాల్లోనే ఈ జన్ ధన్ ఖాతాలు ఎక్కువగా తెరవబడ్డాయి. ఇవి ప్రభుత్వ ప్రయోజనాలను పౌరులకు నేరుగా అందించడంతో పాటూ.. నకిలీ లబ్ధిదారులను, మధ్యవర్తులను తొలగించింది. అదే విధంగా ఆర్థిక స్వావలంబనతో మహిళలకు సాధికారత కల్పించింది.

========================

అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025 వేడుకల్లో భాగంగా కార్గిల్‌లో కొత్తగా నిర్మించిన డిప్యూటీ రిజిస్ట్రార్ కో-ఆపరేటివ్ ఆఫీస్ కాంప్లెక్స్ ను లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ కవిందర్ గుప్తా ఈరోజు ప్రారంభించారు. అదే విధంగా కెఫెటేరియా-కమ్-షోరూమ్‌ను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ గవర్నర్ మాట్లాడుతూ.. లడఖ్‌లో సహకార రంగం 271 క్రియాశీలక సంఘాలతో బలంగా ఉందన్నారు. 2 కోట్ల 24 లక్షల రూపాయల వ్యయంతో కేవలం ఒకటిన్నర సంవత్సరాలలోనే పూర్తయిన ఈ కో-ఆపరేటివ్ ఆఫీస్ కాంప్లెక్స్ లడఖ్ ప్రాంతంలో సహకార రంగాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. అలాగే కోటి 45 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన కెఫెటేరియా-కమ్-షోరూమ్ ఆప్రికాట్ తో పాటూ.. ఇతర సహకార ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహిస్తుందని చెప్పారు.

========================

ఒడిశా, ఛత్తీస్‌గఢ్, కోస్తాంధ్ర, తెలంగాణ, మహారాష్ట్ర, కేరళ, తీరప్రాంత కర్ణాటకలలో రేపు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐ.ఎం.డి) తెలిపింది. అదే విధంగా రాబోయే వారం రోజుల పాటు వాయువ్య భారతదేశంలో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఐఎండీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.కె. జెనామణి ఈరోజు ఆకాశవాణితో మాట్లాడుతూ... గత 24 గంటల్లో జమ్మూలోని కొన్ని ప్రాంతాల్లో అనూహ్యంగా భారీ వర్షపాతం నమోదైందని వెల్లడించారు. తెలంగాణకు రెడ్ అలర్ట్ హెచ్చరికలు జారీ చేయగా.. ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశామని పేర్కొన్నారు.

========================
========================